


సూరవరంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డే మరలా కాబోయే ముఖ్యమంత్రి అని నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని సూరవరం గ్రామంలో రూ.4 కోట్ల 50 లక్షల వ్యయంతో నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సూరవరం గ్రామ సర్పంచి గరికపాటి వీర వెంకటేశ్వరరావు, కొమ్మూరు సర్పంచి కె.ఏసు, జడ్‌పిటిసి పి.వీరబాబు, ఎంపిపి జి.అనూష ఇస్సాక్, పార్టీ మండల అధ్యక్షులు పి.నరశింహరావు పాల్గొన్నారు.



సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ ప్రతాప్

సాగు చేసేదెంత.. రుణం ఇచ్చిందెంత..!



కౌలు రైతులకు పంట రుణాల మంజూరులో తీవ్ర అన్యాయం
రెండు జిల్లాల్లో 70 శాతానికిపైగా సాగు కౌలురైతుల చేతుల్లోనే
ఈ ఆర్థిక సంవత్సరంలోనూ అరకొర రుణాలే
రూ.పది వేల కోట్ల రుణ ప్రణాళికలో రూ.450 కోట్లులోపే రుణాలు
సాగు చేయని భూయజమానుల జేబుల్లోకే పంట రుణాల సొమ్ము
మూడు లక్షల మంది కౌలురైతుల గోడుపట్టని ప్రభుత్వం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కౌలురైతులకు ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోంది. సాగు చేసే కౌలురైతులకు కాకుండా భూయజమానులకు బ్యాంకులు పంట రుణాలు మంజూరు చేస్తుండటం గమనార్హం. 2023-24 ఆర్థిక సంవత్సరంలోనూ రుణాల మంజూరులో ఇదే పరిస్థితి కొనసాగింది. కౌలురైతులు సాగు చేస్తున్న ఆయకట్టుకు, బ్యాంకులు మంజూరు చేసిన పంట రుణాలకు పొంతన లేకుండాపోయింది. వ్యవసాయ రుణ ప్రణాళికలో పంట రుణాల మంజూరుకు కేటాయించిన సొమ్ములో ఐదుశాతం సొమ్ము కూడా కౌలురైతులకు అందకుండాపోయింది. దీంతో కౌలురైతులు సాగు పెట్టుబడులకు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. రాష్ట్రంలోనే అత్యధికంగా కౌలురైతులు ఉన్న జిల్లాల్లో ఏలూరు, పశ్చిమగోదావరి ఉన్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నారు. రుణార్హత కార్డులు అందుకున్న రైతులు పట్టుమని లక్షా 30 వేల మంది కూడా లేరు. దాదాపు లక్షా 50 వేల మందికిపైగా కౌలురైతులకు రుణార్హత కార్డులే మంజూరు చేయని పరిస్థితి జిల్లాల్లో నెలకొంది. రెండు జిల్లాలో దాదాపు 15 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. వరి, పామాయిల్, మొక్కజొన్న, పొగాకు వంటివి ప్రధాన పంటలుగా ఉన్నాయి. రెండు జిల్లాల్లో సాగవుతున్న వ్యవసాయ భూమిలో 70 శాతానికిపైగా సాగు కౌలురైతులే చేస్తున్నారు. వ్యవసాయ సాగులో కీలక భూమిక పోషిస్తున్న కౌలురైతుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో మొత్తంగా లక్షా 30 వేల మంది కౌలురైతులకు మాత్రమే కౌలుకార్డులు మంజూరు చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రెండు జిల్లాల్లోనూ కౌలురైతులకు మంజూరు చేసిన రుణం రూ.450 కోట్లులోపే ఉన్నట్లు తెలుస్తోంది. దీనిలో పశ్చిమగోదావరి జిల్లాలో రూ.350 కోట్లు వరకూ రుణాలిచ్చినట్లు చెబుతున్నారు. ఏలూరు జిల్లాలో రూ.వందకోట్లులోపే కౌలురైతులకు పంటరుణాలు మంజూరైన పరిస్థితి ఉంది.

పంట రుణాల ప్రణాళికకు.. చేతలకు పొంతన కరువు

రెండు జిల్లాల్లో వ్యవసాయ రుణ ప్రణాళికల్లో పంట రుణాలకు దాదాపు రూ.పది వేల కోట్లు వరకూ కేటాయించిన పరిస్థితి ఉంది. 2024-25 రుణ ప్రణాళికలోనూ ఏలూరు జిల్లాలో పంట రుణాలకు రూ.6,306 కోట్లు కేటాయిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నిబంధనల ప్రకారం పంట రుణాలు సాగుదారునికి మాత్రమే ఇవ్వాలి. భూయజమానికి పంటేతర రుణం అందించాల్సి ఉంది. ఎక్కడా అటువంటి పరిస్థితి లేకుండా పోయింది. సాగు చేయని భూయజమానికి పంట రుణాలు మంజూరు చేస్తున్నారు. అధికారులు చెబుతున్న పంట రుణాల ప్రణాళికలో ఐదు శాతం సొమ్ము కూడా కౌలురైతులకు ఇవ్వడం లేదు. దీంతో కౌలురైతులు పెట్టుబడి కోసం ప్రయివేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు. ఇ-క్రాప్ బుకింగ్‌లో భూయజమానుల పేర్లు చేర్చి వారికే పంట రుణాలు ఇస్తున్నారు. దీంతో పంటలు దెబ్బతింటే పరిహారంగాని, బీమా సొమ్ము సైతం కౌలురైతులకు అందడం లేదు. ప్రభుత్వం ప్రతియేటా అందిస్తున్న రైతుభరోసా సొమ్ము సైతం భూయజమానుల జేబుల్లోకే వెళ్లిపోతున్నాయి. వైసిపి ప్రభుత్వం కౌలురైతుల పట్ల మరింత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మేనిఫెస్టోలో ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు అంశంపై డిమాండ్

వ్యవసాయ సాగులో కీలక పాత్ర పోషిస్తున్న కౌలురైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలనే డిమాండ్ బలంగా విన్పిస్తోంది. ఎన్నికల మేనిఫెస్టోలో రాజకీయ పార్టీలు ఈ అంశాన్ని చేర్చాలని కౌలురైతులు డిమాండ్ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో కౌలురైతులకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తామని తెలిపింది. ఇప్పుడు జనసేన టిడిపి పొత్తుతో ఎన్నికలకు వెళ్తోంది. ఈసారి మేనిఫెస్టోలోనూ ఈ అంశం చేర్చుతుందా.. లేదా అనే చర్చ సాగుతోంది. కౌలురైతులకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని వాస్తవ సాగుదారులు ఘంటాపథంగా చెబుతున్నారు.



పోలియోచుక్కలు వేస్తున్న కలెక్టర్

పోలియోరహిత సమాజమే ధ్యేయం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కల పంపిణీ
నేడు, రేపు ఇంటింటికీ వెళ్లి పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

పోలియోరహిత సమాజమే మన ధ్యేయమని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. ఆదివారం ఏలూరు తాపీమేస్త్రీ కాలనీలోని 2వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాల్లోపు చిన్నారులు అందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. కొన్నేళ్లుగా దేశంలో పోలియో కేసులు నమోదు కావడం లేదని, ఆ పరంపరను ఇలాగే కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. ముందుజాగ్రత్త చర్యగా ప్రభుత్వ కృషికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.91 లక్షల పిల్లల కోసం 2.39 లక్షల డోసులు సిద్ధం చేశారని తెలిపారు. జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు పిల్లలు 1,91,466 మంది ఉన్నారన్నారు. వీరిలో గ్రామీణ ప్రాంతాల్లో 1,40,175 మంది, పట్టణ ప్రాంతాల్లో 32,447 మంది, గిరిజన ప్రాంతాల్లో 18,844 మంది ఉన్నట్లు వివరించారు. మొత్తం 2,39,400 డోసులను సిద్ధంగా ఉంచామన్నారు. వ్యాక్సిన్ వేసేందుకు గ్రామీణ ప్రాంతాల్లో 1251, పట్టణ ప్రాంతాల్లో 153, గిరిజన ప్రాంతాల్లో 305, ట్రాన్సిట్ 46 మొత్తం 1755 పోలియో వ్యాక్సిన్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 76 మొబైల్ టీమ్స్, 152 మొబైల్ వ్యాక్సిన్ బృందాలను సిద్ధం చేసి చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నట్లు వివరించారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు తదితర చోట్ల కూడా పోలియో వ్యాక్సిన్ పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. ఆశా కార్యకర్తలతో కలిపి 7347 మంది వైద్యఆరోగ్య శాఖ సిబ్బందితోపాటు వీరికి అదనంగా అంగన్‌వాడీ, ఐకెపి, డ్వాక్రా తదితరాలకు సంబంధించిన సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచినట్లు వివరించారు. ఈ నెల 4, 5 తేదీల్లో ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులకు వ్యాక్సిన్ వేస్తారన్నారు. కార్యక్రమంలో ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ఠ, మున్సిపల్ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ, డిసిహెచ్ఎస్ పాల్ సతీష్, డిఐఒ నాగేశ్వరరావు, హెల్త్ఆఫీసర్ మాలతి పాల్గొన్నారు.

ఒపిఎస్‌పై నెలాఖరు వరకూ ఉద్యమం



మాట్లాడుతున్న రవికుమార్

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్

ఏలూరు అర్బన్: ఒపిఎస్ సాధన కోసం ఈ నెలాఖరు వరకూ వివిధ రూపాల్లో ఉద్యమించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జిల్లా అధ్యక్షులు ముస్తఫా అధ్యక్షతన జరిగింది. రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల పదో తేదీ వరకూ అన్ని పాఠశాలలు, ఆఫీసుల్లో 'ఓట్ ఫర్ ఒపిఎస్' బుక్‌లెట్స్, స్టిక్కర్లతో ప్రచారం సాగిస్తామన్నారు. 8వ తేదీ నుంచి పదో తేదీ వరకూ అన్ని డివిజన్, జిల్లా కేంద్రాల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు నిర్వహిస్తామని, 15 నుండి 30వ తేదీ వరకు ఎంఎల్ఎ అభ్యర్థులతో బహిరంగ చర్చా వేదికలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ నెల 26 నుండి 30వ తేదీ వరకు అన్ని నియోజకవర్గాల్లో బైక్ ర్యాలీలు నిర్వహిస్తామని చెప్పారు. పాత పెన్షన్ విధానం (ఒపిఎస్) అమలుపై రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న ఎంఎల్ఎ అభ్యర్థులు తమ వైఖరి ప్రకటించాలని, ఆ మేరకు ఆయా పార్టీల మేనిఫెస్టోలో పెట్టాలని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ మహాసభలు మండల, జిల్లాస్థాయిలో పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ సందర్భంగా ఉపాధ్యాయులకు అనేక రకాలైన ఆటలు, సాంస్కృతిక పోటీలు, సదస్సులు నిర్వహిస్తామని వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయినులు, అంగన్వాడీలు, ఆశాలు, సమగ్ర శిక్ష ఉద్యోగినులతో కలిపి సదస్సులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సాబ్జీ స్మారక భవన నిర్మాణానికి విరాళమిచ్చిన పెదపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులు, నేత యువి.సత్యనారాయణను అభినందించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి సుభాషిణి, జిల్లా గౌరవాధ్యక్షులు శ్యాంబాబు, జిల్లా సహాధ్యక్షులు వి.కనకదుర్గ, జిల్లా కోశాధికారి జివి.రంగమోహన్, జిల్లా కార్యదర్శి రాంబాబు, అన్ని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, నేతలు పాల్గొన్నారు.

కొనసాగిన టెట్ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

జిల్లా కేంద్రమైన ఏలూరులో టెట్ పరీక్షలు ఆదివారం ఆరో రోజు కొనసాగాయి. సిఆర్.రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, సిద్ధార్థ క్వెస్ట్ కాలేజ్, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో నిర్వహించిన పరీక్షల్లో ఉదయం పరీక్షకు 365 మంది హాజరు కావాల్సి ఉండగా 327 మంది హాజరయ్యారు. 38 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 365 మందికిగాను 334 మంది హాజరయ్యారు. 31 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని టెట్ మరియు డీఎస్సీ రాయు అభ్యర్థులకు ఏ విధమైన సందేహాలు డిఇఒ అబ్రహం తెలిపారు.

పోలియో రహిత దేశాన్ని నిర్మిద్దాం

పల్స్ పోలియో విజయవంతం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్


అప్పుడే పుట్టిన పిల్లల వాడి నుంచి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు వారి తల్లిదండ్రులు తప్పనిసరిగా పల్స్ పోలియో చుక్కలు వేయించాలని, తద్వారా పోలియో రహిత దేశాన్ని నిర్మించడంలో భాగస్వాములు అవ్వాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక జంగారెడ్డిగూడెం పరిధిలో ఆదివారం జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్స్ పోలియో చుక్కలపై అంగన్వాడీలు, ఎఎన్ఎంలు ప్రత్యేక దృష్టి వహించి ప్రతి ఒక్కరికి పోలియో చుక్కలు అందేవిధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు పాల్గొన్నారు.

భీమడోలు: పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ, సహకారాలు అందజేయాలని భీమడోలు జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవాని రంగా, భీమడోలు సర్పంచ్ల ఛాంబర్ అధ్యక్షురాలు పి.సునీత మాన్సింగ్ కోరారు. మండల కేంద్రమైన భీమడోలులో ఆదివారం ప్రారంభమైన పోలియో చుక్కల కార్యక్రమాన్ని వారు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ శ్రీలక్ష్మి ఆరోగ్య కేంద్రం పరిధిలో కొనసాగుతున్న పోలియో చుక్కల కార్యక్రమం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ముసునూరు: పుట్టిన ప్రతి బిడ్డ నుంచి ఐదు సంవత్సరాలలోపున్న ప్రతి ఒక్కరికి పల్స్ పోలియో చుక్కలు వేయించాలని కొర్లకుంట సొసైటీ అధ్యక్షులు మూల్పూరి నాగమల్లేశ్వరరావు, గ్రామ సర్పంచి నక్కనబోయిన సత్యనారాయణలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని 16 గ్రామాల్లో పల్స్ పోలియో చుక్కల కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండ దుర్గ భవాని వెంకటరావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి పాముల గంగాధర్ రావు, సర్పంచి పెరం కృష్ణ, తహశీల్దార్ జోహార్ బాజీ, ఎంపిడిఒ చాగంటి పద్మావతి దేవి, పలువురు సర్పంచులు, వైద్యులు డాక్టర్ కరీముల్లా, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చింతలపూడి: పోలియో రహిత సమాజాన్ని నిర్మించేందుకు ప్రతిపౌరుడు కృషి చేయాలని చింతలపూడి అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ కె.అనిల్ కుమార్ అన్నారు. చింతలపూడి పట్టణంలో జరిగిన పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా భట్టువారిగూడెంలోని పోలియో కేంద్రంలో డాక్టర్ అనిల్ కుమార్ పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో వ్యాధి రహిత సమాజమే పల్స్ పోలియో కార్యక్రమం లక్ష్యం అని తెలిపారు. మండలంలోని యర్రగుంటపల్లి, రాఘవాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని సుమారు 6,500 మంది 0 నుంచి 5 సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ మేల్ సయ్యద్ జఫ్రుల్లా, బాలరాజు, ఎఎన్ఎం ఎం.మంగతాయారు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని డిప్యూటి డిఎంహెచ్ఒ జాస్తి జగన్మోహనరావు అన్నారు. ఆదివారం పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆయన అడవినెక్కలం, గొల్లగూడెం గ్రామంలో 5 సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మండల పరిధిలోని ఆగిరిపల్లి, ఈదర, సగ్గూరు పిహెచ్‌సి పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు టీనా, మంజుల, సంధ్య, జ్యోతి, గంగాధర్, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బుట్టాయగూడెంలో పోలియో చుక్కలు వేస్తున్న ఎంఎల్ఎ బాలరాజు

కామవరపుకోట: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమం ఆదివారం ప్రశాంతంగా జరిగింది. తడికలపూడి సొసైటీ, అంగన్వాడీ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బూత్‌లలో జెడ్‌పిటిసి కడిమి రమేష్ పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేసి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 49 సాధారణ బూత్‌లు, 1 మొబైల్ బూత్ వెరసి మొత్తం 50 బూత్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సుమారు 4,200 మంది చిన్నారులకు పోలియో వేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తడికలపూడి సర్పంచి కొత్తపల్లి రజినీ శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడు రూరల్: డివిజన్ కేంద్రంలోని మున్సిపాలిటీలో ఆదివారం పోలియో చుక్కల కార్యక్రమాన్ని ఆర్‌డిఒ భవానీ శంకరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 0 నుంచి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. అపోహలు వీడి ప్రతి ఒక్క తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలని, అది తమ బాధ్యతగా గుర్తించాలన్నారు. పోలియో చుక్కలు వేయడం ద్వారా పరిపూర్ణ ఆరోగ్య సమాజాన్ని నిర్మించగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, డాక్టర్ కొలుసు సౌమ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలో పల్స్ పోలియో కార్యక్రమాలు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం విస్తృతంగా కొనసాగాయి. పోలవరం మండలంలో గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, పోలవరం, ఇటుకలకోట, వింజరం, చేగొండపల్లి, ప్రగడపల్లి, జిల్లెల్లగూడెం, కోండ్రుకోట, ఎల్ఎన్‌డి పేట గ్రామ పంచాయతీలలో పల్స్ పోలియో కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వింజరం వైద్యాధికారి డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ ఎల్లండిపేట పరిధిలో 26, వింజరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 28 పల్స్ పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు.

మండవల్లి: పోలియోను దేశం నుంచి తరిమికొట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని కైకలూరు ఎఎంసి ఛైర్మన్ చేయిబోయిన వీర్రాజు స్పష్టం చేశారు. స్థానిక ఎంపీపీ పాఠశాల-1లో ఏర్పాటుచేసిన పల్స్ పోలియో కేంద్రంలో ఆయన ఆదివారం చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలను వేశారు. పోలియో రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గుడివాడ బాబి, మాజీ అధ్యక్షులు బొమ్మన బోయిన గోకర్ణ యాదవ్, మెండ సురేష్, ఆగొల్లు సత్యనారాయణ, డాక్టర్ అనిలా, సిహెచ్ఒ శ్రీనివాసరావు, ఎఎన్ఎం కనకదుర్గ, ఆశ వర్కర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

చాట్రాయి: ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కల కార్యక్రమం ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో విజయవంతంగా వైద్య సిబ్బంది నిర్వహించారు. బూరుగు గూడెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి గ్రామ సచివాలయంలో చిన్న పిల్లలకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చాట్రాయిలో గ్రామ సర్పంచి దామెర ఉష, పోలవరం గ్రామంలో చెలికాని బాబ్జి, నరసింహారావు పాలెం గ్రామంలో మండల ఉపాధ్యక్షులు పుచ్చకాయల సుబ్బారెడ్డి, గ్రామ సచివాలయాలలో పల్స్ పోలియో చుక్కలు చిన్న పిల్లలకు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. 98 శాతం పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం విజయవంతమైందని వైద్యాధికారులు కె.విజయలక్ష్మి, బి.దుర్గాప్రసాద్ తెలిపారు. మిగిలిన పిల్లలకు సోమ, మంగళవారాల్లో తమ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పోలియో చుక్కలు వేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ జివి.రమణ, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. జీలుగుమిల్లి, కామయ్య పాలెం, రాచన్నగూడెం పిహెచ్‌సిల పరిధిలో మొత్తం 30 బూత్‌లకు పైగా ఏర్పాటు చేసినట్లు వైద్యాధికార్లు గాయత్రి, దివ్య తెలిపారు. ఈ బూత్‌ల ద్వారా 2,500 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు వసంతరావు, సర్పంచి సున్నం ఉషారాణి, సిహెచ్ఒ శ్రీనివాసరాజు, వైద్య సిబ్బంది, ప్రసాద్, మంగతాయారు పాల్గొన్నారు.

ముదినేపల్లి: మండలంలో ఆదివారం నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతమైనట్లు ఆయా పిహెచ్‌సిలా వైద్యాధికారులు తెలిపారు. మండలంలోని దేవపూడి, గురజ, ముదినేపల్లి పిహెచ్‌సిల పరిధిలో నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం 98 శాతం జరిగినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడాలిలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ పోలియో చుక్కలు వేశారు.

కుక్కునూరు : మండల పరిధిలో అమరవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మారుమూల గ్రామాలైనటువంటి గొట్టపుతోగు, రెగులచెరువు, కురుమలతోగు, కొత్తూరు, బండర్లగూడెం, చీపురుచెలక మొదలగు గ్రామాలలో 0-5 సంవత్సరాల లోపు పిల్లలను ఫీడర్ అంబులెన్స్ ఇఎంటి రాజు అంబులెన్స్‌లో పల్స్ పోలియో బూత్‌లకు తరలించి పోలియో చుక్కలు వేపించారు. డాక్టర్ అనంత్, శ్రీకాంత్ వాహనాలు వెళ్లలేని మారుమూల గ్రామాలకు వెళ్లి పోలియో డ్రాప్స్ స్వయంగా వేశారు. మొదటి రోజు మొత్తం 1,746 మంది చిన్నారులకు పోలియో డ్రాప్స్ వెయ్యడం జరిగింది. 36 వేక్సినేటర్ టీంలు కలిసి పోలియో వాక్సినేషన్‌ని పూర్తి చేశారు.

టి.నరసాపురం : మండలంలో 4,986 మంది చిన్నారులకు పోలియో చుక్కలు పంపిణీ చేసినట్లు మండల వైద్యాధికారిణి జె.కల్పనా రాణి ఆదివారం తెలిపారు. మండలంలో 56 పోలియో కేంద్రాలలో 5 సంవత్సరాల లోపు చిన్నారులు 5,159 మందికి గాను 4,986 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు ఆమె తెలిపారు.

బుట్టాయగూడెం: ఐటిడిఎ పరిధిలోని 321 కేంద్రాలలో 90 శాతం వరకు పోలియో చుక్కలు వేసామని ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ తెలిపారు. ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు, ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేశారు. ఇంకా ఎవ్వరైనా కొన్ని కారణాల వల్ల పోలియో చుక్కలు వేయించుకోకపోతే సోమ, మంగళవారం గృహాల వద్దకు వెళ్లి పోలియో చుక్కలు వేస్తాం అని డిప్యూటీ డిఎంహెచ్ఒ మేరీ కేతరిన్ తెలియజేశారు.




పోలవరంలో..



చింతలపూడిలో..



మండవల్లిలో..



చాట్రాయిలో..




జీలుగుమిల్లిలో..



జంగారెడ్డిగూడెంలో పోలియో చుక్కలు వేస్తున్న ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి



కామవరపు కోటలో..



మాట్లాడుతున్న ఎంఎల్ఎ ప్రతాప్

జగన్ హయాంలోనే ఏపి అభివృద్ధి

నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో ముందుకు తీసుకు వెళుతున్నారని నూజివీడు ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామంలో గోగులంపాడు నుంచి ముక్కోళ్లపాడు వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణానికి రూ.4 కోట్ల 10 లక్షల ప్రభుత్వ నిధులు వెచ్చించి గోగులంపాడు గ్రామస్తుల చిరకాల కోరిక నెరవేరుస్తున్నట్లు ఆయన తెలిపారు. జగన్మోహన్ రెడ్డి వాలంటీర్ వ్యవస్థ తీసుకొచ్చి నవరత్నాలు పేరుట ఎన్నో పథకాలు ప్రవేశపెట్టి, అందరికీ ఉపయోగపడుతున్నారని నిరుపేద, బడుగు, బలహీన వర్గాల వారందరి మన్ననలు పొందిన వ్యక్తి అని కొనియాడారు. మరలా ముఖ్యమంత్రిగా జగన్మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కంఠ దుర్గ భవాని వెంకటేశ్వరరావు, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నారాయణ, ఎంపిటిసి పాముల గంగాధర్ రావు, సర్పంచులు పేరం కృష్ణ, పి.సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షులు ముల్పూరి నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ పరిశీలన

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

రాబోయే ఎన్నికల దృష్ట్యా మండల పరిధిలోని ఈదులగూడెం జడ్‌పిహెచ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌స్టేషన్‌ను నూజివీడు రూరల్ సిఐ రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ సురేంద్రకుమార్‌తో కలిసి పరిశీలించారు.

రాక్షస పాలనకు స్వస్తి చెప్పాలి

జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రాక్షస పాలన నుంచి విముక్తి పొందాలంటే టిడిపి, జనసేన ఐక్యతగా ఉండాలని, రానున్న రోజుల్లో టిడిపి, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని జనసేన పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు తెలిపారు. జంగారెడ్డిగూడెంలోని రాజా రాణి ఫంక్షన్ హాల్‌లో టిడిపి, జనసేన సమన్వయ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సొంగ రోషన్ కుమార్ ఏర్పరిచిన సమన్వయ కమిటీ సభకు జనసేన ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, పోలవరం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి చిర్రి బాలరాజు, ఏలూరు జిల్లా టిడిపి ఉపాధ్యక్షులు గోరుముచ్చు గోపాల్ యాదవ్, పోలవరం నియోజకవర్గం మండల అధ్యక్షులు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పనులు ప్రారంభించాలి

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు తక్షణం ప్రారంభించాలని సిపిఎం సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మల్లాయగూడెంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సమావేశం సర్పంచి చీకటి రమేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మామిళ్ళపల్లి వసంతరావు మాట్లాడుతూ మండలంలోని మల్లాయ గూడెం, సమిలిపాలెం గూడెం, పోతునూరు, చింతలపూడి తదితర గ్రామాల ప్రజలకు వ్యవసాయానికి సాగునీరు అందించాలంటే తక్షణం చింతలపూడి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి చేయాలని తెలియజేశారు. ఈ సమావేశంలో ఏపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, ఏపి రైతు సంఘం మండల నాయకులు తక్కెలపాటి ప్రసాద్, ఎస్.కె.జాని, మాజీ సర్పంచి చీకటి బాబురావు పాల్గొన్నారు.

వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అతివేగం వాహనదారుల ప్రాణాలను హరించి వేస్తుందని పెదపాడు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు. తలపాడు మండలం కలపర్రు టోల్ ప్లాజా వద్ద ఆదివారం పెదపాడు ఎస్ఐ శుభ శేఖర్ వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టోల్‌గేట్ దాటి వెళ్లే ప్రజలకు, హెల్మెట్ వాడకుండా వాహనాలు నడిపే వారికి అవగాహన కల్పించారు. అనంతరం ఆయన వారిని ఉద్దేశించి మాట్లాడుతూ వాహన ప్రమాదాలలో ఎక్కువ మంది హెల్మెట్ వాడకుండా రోడ్డు ప్రమాదాలకు గురైన సమయంలో మృతి చెందిన వారేనని ఆయన తెలిపారు. హెల్మెట్ వాడకం వల్ల ప్రాణాపాయ పరిస్థితి నుంచి బయట పడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.




వాహనదారునికి అవగాహన కల్పిస్తూ..

శివాలయానికి టీవీ బహూకరణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

స్థానిక శివాలయానికి శ్రీసాయి సూర్య విద్యా సంస్థల అధినేత కంచర్ల పవన్ కుమార్ ఆదివారం టీవీ బహూకరించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ కమ్మిల రమేష్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయంలో రద్దీగా వుండే సమయంలో భక్తులు పూజా కార్యక్రమాలు బయట నుంచి తిలకించేందుకు టీవీ ఉపయోగపడుతుందని అన్నారు. టీవీ బహూకరించిన పవన్ కుమార్‌ను ఆలయ కమిటీ తరుపున అభినందించారు. అనంతరం ఆలయ పూజారి వినయ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండం ఆదిత్య కుమార్, బంౖడెడ్డి శేఖర్ పాల్గొన్నారు.



టీవీ అందజేస్తూ..

నేరాలు - ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం కలరాయనగూడెంలోని గ్రామంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ధర్మాజీగూడెం ఎస్ఐ చెన్నరావు తెలిపిన వివరాల ప్రకారం డోలా యేసు(65) ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం పంపించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ముసునూరు

ట్రాక్టర్‌పై నుంచి కిందపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ముసునూరు మండలంలో ఆదివారం చోటుచేసుకుంది. తెలిసిన సమాచారం ప్రకారం మండలంలోని చెక్కపల్లి గ్రామంలో అక్కిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బర్మా రాంబాబు(30) వ్యవసాయ కూలీ. ఆదివారం మొక్కజొన్న లోడు కూలీ పని నిమిత్తం ట్రాక్టర్‌పై కూర్చుని వెళుతుండగా ట్రాక్టర్ గోతిలో నుంచి రాయికి తగిలి ఎగిరి పడటంతో ఒక్కసారిగా ఆ వ్యక్తి కింద పడిపోయి ప్రమాదానికి గురయ్యాడు. నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

పందెంరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - ముసునూరు

రహస్యంగా కోడిపందేలు వేస్తున్న పందెం రాయుళ్లపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ముసునూరు ఎస్ఐ పి.వాసు తెలిపారు. పూర్తి వివరాల్లోకి వెళ్లగా మండలంలోని రమణక్కపేట గ్రామంలో ఆదివారం రహస్యంగా కోడిపందేలు నిర్వహిస్తున్న వారిపై ముసునూరు ఎస్ఐ పి.వాసు తమ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఏడుగురు పందెం రాయుళ్లను, 7 బైకులు, రూ.1400 నగదును స్వాధీనం చేసుకుని, రెండు పుంజులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొన్నా, కోడిపందేలు వేసినా వాళ్లపై రౌడీషీట్లు తెరవబడునని తెలియజేశారు.

'మానవత' కృషి ఆదర్శప్రాయం

ఉంగుటూరు ఎంఎల్ఎ పుష్పాల వాసుబాబు



ప్రారంభోత్సవం చేస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు, వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి - భీమడోలు

సేవా కార్యక్రమాల్లో భాగంగా నూతన ఆవిష్కరణల ప్రవేశానికి స్వచ్ఛంద సేవా సంస్థ మానవత చేస్తున్న కృషి ఇతరులకు ఆదర్శప్రాయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పుష్పాల వాసుబాబు అన్నారు. భీమడోలులో గ్రామపంచాయతీ కేటాయించిన 300 గజాల స్థలంలో సంఘ సభ్యులు, దాతలు, అభిమానులు ఇచ్చిన సుమారు రూ.30 లక్షల విరాళాలతో నిర్మించిన మానవత భీమడోలు శాఖ కార్యాలయ భవనాన్ని ఆ సంస్థ వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డితో కలిసి ఆయన ఆదివారం ప్రారంభించారు. భీమడోలు శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలను గుర్తించి తమ సిఫార్సు మేరకు శాఖ కార్యాలయ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించిన భీమడోలు సర్పంచి సునీత మాన్సింగ్ ఆధ్వర్యంలోని పంచాయతీ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఇదే క్రమంలో మానవత జిల్లా డైరెక్టరీ, భీమడోలు రీజనల్ డైరెక్టరీలను ఆయన ఇతర ప్రముఖులతో కలిసి ఆవిష్కరించారు. అంతకుముందు మానవత జెండా ఆవిష్కరణలో సంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవత చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా శవాలను భద్రపరిచే ఫ్రీజర్లను ఉచితంగా అందజేయడం ద్వారా దూర ప్రాంతాల్లో ఉండే చనిపోయిన వ్యక్తి కుటుంబాలకు వ్యక్తి అంతిమ సంస్కారాలలో ఆలస్యంగా సైతం పాల్గొనే అవకాశం లభించిందన్నారు. తాజాగా భీమవరం శాఖ ఫ్రీజర్‌తో పాటు అంబులెన్స్‌ను అనుసంధానం చేసే వాహనాన్ని సమకూర్చడం ద్వారా అత్యవసర వైద్య సేవలు ఉచితంగాను, సకాలంలోనూ అందజేసే సౌకర్యం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ తరహా నూతన ఆవిష్కరణలను ఇతర శాఖలు సైతం అమలు చేయాలని కోరారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం ఇప్పటికే పలు కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తుందన్నారు. దీనికి అదనంగా ప్రతిభకలిగిన పేద విద్యార్థులను ప్రోత్సహించడంతో పాటు, కొందరు విద్యార్థులు తమ విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు మానవత చేస్తున్న చొరవతో చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. దీనికోసం జిల్లాస్థాయిలో విద్యానిధి పేర కోట్లాది రూపాయల నిధులను సభ్యుల సహకారంతో సమకూర్చి దానిపై వచ్చే అదనపు ఆదాయం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించటం శ్లాఘనీయమన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా ప్రతి శాఖ లక్షలాది రూపాయల వ్యయంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం, ప్రభుత్వ వైద్యశాలల్లో, పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకు ముందుకు రావడం జరుగుతుందన్నారు. విద్యార్థుల కోసం కెరియర్ గైడెన్స్ తరగతులు నిర్వహించడం ద్వారా విద్యార్థుల భావి, ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసేందుకు సహకరిస్తుందని అభినందించారు. ఈ తరహా కార్యక్రమాలు చేపడుతున్న మానవత భీమడోలు శాఖకు తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పలువురు మానవత సభ్యులు మాట్లాడుతూ మానవతా సేవలు రాష్ట్ర పరిధిలోని 110 మండలాల్లో కొనసాగుతున్నాయన్నారు. ఉత్తమ సమాజ స్థాపన మానవత చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి వారు వివరించారు. స్థానికంగా మానవత విద్యావ్యాప్తికి, ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించటం, పేద విద్యార్థులను ఆదుకోవడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఇదేక్రమంలో సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సైతం సహకరిస్తుందని వివరించారు. ప్రస్తుతం నిర్మించిన భీమడోలు శాఖ కార్యాలయంలో జిల్లాస్థాయి సమావేశాలు సైతం నిర్వహించుకునేందుకు అనువుగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా, మండల డైరెక్టర్ల బోర్డు, కార్యవర్గ సభ్యులతో పాటు భీమడోలు జెడ్‌పిటిసి తుమ్మగుంట భవాని రంగా, ఎంపిపి కనమాల రామయ్య పాల్గొన్నారు.

రోటరీ నూతన కార్యదర్శిగా హనుమాన్ తిలక్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

రోటరీ జంగారెడ్డిగూడెం 24-25 సేవాసంవత్సరం అధ్యక్షుడు వూడా రాంగోపాల్(గోపీ), నూతన కార్యదర్శి బవిరిశెట్టి హనుమాన్ తిలక్ సారధ్యంలో జూన్ నుంచి ఒక సంవత్సర కాలంపాటు సేవాకార్యక్రమాలు చేపడుతుందని రోటరీ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఎలెక్ట్ దాకారపు కృష్ణ తెలిపారు. రోటరీ సర్వసభ్య సమావేశం స్థానిక శ్రీమల్లాది సీతారామలింగేశ్వరరావు రోటరీ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా దాకారపు కృష్ణ మాట్లాడుతూ గతంలోనే వూడా రాంగోపాల్‌ను అధ్యక్షునిగా ఎన్నుకోగా నేడు గోపి సారధ్యంలోని కార్యవర్గానికి కార్యదర్శిగా బవిరిశెట్టి హనుమాన్ తిలక్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో పాలపర్తి శ్రీనివాస్, కెఎల్ఎన్.ధనకుమార్, జవ్వాజి ఉమా వెంకటేష్, పడాల సూర్యనారాయణరెడ్డి, అయినపర్తి చంద్రశేఖర్, జయవరపు కుమార్, సందీప్ పాల్గొని నూతన నాయకత్వంను అభినందించారు.

పల్స్ పోలియో కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు: ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు దేశవ్యాప్తంగా అందిస్తున్న పోలియో చుక్కల పంపిణీలో జంగారెడ్డిగూడెం కొత్త బస్టాండ్‌లోని పోలియో కేంద్రాలను రోటరీ ప్రతినిధులు సందర్శించి పోలియో చుక్కలు వేశారు. పాలపర్తి శ్రీనివాస్, దాకారపు కృష్ణ రెండు కేంద్రాల్లో పోలియో చుక్కలు చిన్నారులకు అందించారు. ఈ సందర్భంగా రోటరీ జిల్లా పబ్లి ఇమేజ్ రీజినల్ ఛైర్మన్ పాలపర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా పోలియోను రూపుమాపే క్రమంలో అంతర్జాతీయ రోటరీ వివిధ సంస్థలు, ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తోందన్నారు. పోలియో చుక్కలను ఉచితంగా అందించే కృషిలో రోటరీ క్రియాశీలక పాత్ర పోషిస్తోందని, పోలియో రహిత సమాజం రోటరీ సమున్నత లక్ష్యమని, క్షేత్రస్థాయిలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా, విద్యార్థుల కృషి అభినందనీయమని అన్నారు.

'టిడిపి, జనసేన కూటమిదే విజయం'


ప్రజాశక్తి - భీమడోలు

రాబోయే ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి విజయం సాధిస్తుందనే ధీమాను టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు వ్యక్తపరిచారు. ఆయన ఆదివారం భీమడోలు మండలం అంబర్‌పేట గ్రామపంచాయతీ పరిధిలోని వడ్లపట్ల ఆవాస ప్రాంతంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన కార్యకర్తలు తమ, తమ పార్టీల జెండాలతో పాల్గొన్నారు. దీనిలో భాగంగా ఇంటింటికీ వెళ్లిన గన్ని అధికారంలోకి వస్తే టిడిపి అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. గ్రామంలో నిర్వహిస్తున్న ర్యాలీ సందర్భంగా తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారిలో ఉన్న చిన్నారి పాపను ఎత్తుకొని ఆశీస్సులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

గోదావరిలో తాగునీటి ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు

ప్రజాశక్తి - కుక్కునూరు

పంచాయతీ పరిధిలోని ప్రజలకు స్వచ్ఛమైన నీళ్లను అందించాలనే ధ్యేయంతో ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేశామని కుక్కునూరు సర్పంచి రావు మీనా వినోద్ తెలిపారు. గోదావరిలో మంచినీటి ఫిల్టర్ పాయింట్ ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ ఇన్నిరోజులు గోదావరి ఉదృతంగా ప్రవహించటం వల్ల ప్రవహించే నీరు అందించామని, గోదావరి శాంతించటంతో ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చేశామని అన్నారు. ఈ ఫిల్టర్ పాయింట్ ఏర్పాటు చెయ్యడం వల్ల బురద నీళ్లు రాకుండా స్వచ్ఛమైన నీళ్లు వస్తాయని తెలిపారు. అలాగే పంచాయతీ పరిధిలో మొత్తం 1,900 పైచిలుకు గోదావరి ట్యాపులు వాడుతున్నారని తెలియజేశారు.




గోదావరిలో ఏర్పాటు చేసిన ఫిల్టర్

వైవాకలో నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వైవాకలో రూ.64.4 లక్షల నిధులతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనాలను ఆదివారం ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు, ఎంఎల్సి జయమంగళ వెంకటరమణ, వైసిపి ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్ కుమార్ యాదవ్ ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరించారు. అనంతరం ప్రజా ఆశీర్వాద యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న డిఎన్ఆర్ మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో జగన్ వెంట నడవడానికి మేము సిద్ధం మరి మీరు సిద్ధమా అనగా పెద్దఎత్తున ప్రజలు జగన్ వెంట నడవడానికి మేమంతా సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంట సంధ్య, కైకలూరు ఎఎంసి ఛైర్మన్ చేబోయిన వీర్రాజు, వైస్ ఎంపిపి చొప్పర్ల సునీత, మండల సర్పంచి ఫోరమ్ అధ్యక్షులు శీలం రామకృష్ణ పాల్గొన్నారు.



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ

చేబ్రోలు విశాల సహకార సంఘానికి అవార్డు

రూ.46 కోట్లకు పైగా రైతులకు రుణాల పంపిణీలో సొసైటీ ఘనత



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న బాబ్జి

ఉంగుటూరు: చేబ్రోలు విశాల సహకార సంఘం(నారాయణపురం సొసైటీ) రైతు సేవల్లో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించి అవార్డు తీసుకోవడం గర్వకారణంగా ఉందని త్రిసభ్య కమిటీ ఛైర్‌పర్సన్ యెలిశెట్టి పాపారావుబాబ్జి అన్నారు. శనివారం సొసైటీ సమావేశ హాలులో సర్వసభ్య సమావేశం కార్యదర్శి యాద్రా శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాబ్జి మాట్లాడారు. తాము బాధ్యతలు చేపట్టిన 2019 నుంచి నేటి వరకూ వివిధ రకాల రుణాలు ఇస్తూ రైతు సేవలో అనేక అవార్డులు అందుకున్నామన్నారు. 2018-19లో ఇచ్చిన అప్పులు రూ.37 కోట్ల 41 లక్షల 30 వేల 415 కాగా 2024 నేటి వరకూ రూ.93 కోట్లకు పైగా రుణాలు అందించి ఈ ఐదేళ్ల కాలంలో రూ.48 కోట్లకుపైగా రైతులకు పంట, పంతేతర అప్పులు ఇచ్చి వార్షిక టర్నోవర్‌ను బాగా వృద్ధి చేశామన్నారు. అన్ని విభాగాల్లో ఉత్తమ సేవలు అందిస్తూ జిల్లాలో గుర్తింపు పొందామన్నారు. టర్నోవర్ రూ.100 కోట్లు చేరిందని పేర్కొన్నారు. ధాన్యం సేకరణలో సైతం లక్ష్యాని కంటే అధికంగానే సేకరణ చేసి సకాలంలో రైతులను ఆదుకున్నామని వెల్లడించారు. కమిటీ డైరెక్టర్లు దాసరి సత్యనారాయణ, సూరె ఏడుకొండలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

'వన్యప్రాణుల రక్షణ బాధ్యత అందరిదీ'



ర్యాలీ చేస్తున్న ఐక్యవేదిక సభ్యులు

ప్రజాశక్తి - మండవల్లి

అంతరించిపోతున్న వన్యప్రాణులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరావు, మండల అధ్యక్షులు అప్పారావు అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవం పురస్కరించుకొని ఐక్యవేదిక మండల శాఖ ఆధ్వర్యంలో వన్యప్రాణుల ఆవశ్యకతపై ప్రజలను చైతన్య పరచడానికి మండవల్లిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వన్యప్రాణులు నానాటికి అంతరించిపోతున్నాయని అన్నారు. పెరుగుతున్న జనాభా పట్టణీకరణ, పారిశ్రామీకీకరణ వల్ల సహజవనాలపై తీవ్ర ఒత్తిడి ఏర్పడుతుందని తెలిపారు. అభివృద్ధి పేరుతో ప్రకృతిని అనేక రకాలుగా ధ్వంసం చేస్తున్నారని, ప్రజల మనుగడను కాపాడడంలో అడవులు, అటవీ జాతులు, చిత్తడి నేలలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. అయితే ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు జీవుల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్నాయని వివరించారు. చిత్తడి నేలల కొల్లేరు ఎన్నో వన్యప్రాణులకు ఆవాసంగా ఉందని, కొల్లేరు సరస్సు నానాటికి ఆక్రమణలు, ఒరేయ్ కుచించుకుపోతుందని, పెద్ద ఎత్తున కాలుష్యం పేరుకుపోయి పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కొల్లేరు సరస్సును వన్యప్రాణులను రక్షించుకోవాల్సిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉందన్నారు. అనంతరం అడవులను రక్షించండి-వన్యప్రాణులను కాపాడండి అంటూ నినాదాలు చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక క్రియాశీలక సభ్యులు కె.మార్కురాజు, బండి రంగారావు, గుడివాడ విజయ్ రమేష్ కుమార్, పొన్నూరు రామచంద్రరావు, గంజాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం అభినందనీయం



శ్మశాన వాటికను ప్రారంభిస్తున్న మానవత సభ్యులు

ప్రజాశక్తి - చింతలపూడి

మాదాపుకుంట చెరువు శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళాలు ఇచ్చిన దాతలకు అభినందనలు అని మానవత స్వచ్ఛంద సేవ సంస్థ చింతలపూడి మండల అధ్యక్షులు సోమశేఖర్ అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చింతలపూడి శాఖ ఆధ్వర్యంలో మాదాపు కుంట శ్మశాన వాటిక అభివృద్ధి చేసి, ఈనెల3వ తేదీ ఆదివారం శ్మశాన వాటిక ప్రారంభించడం జరిగింది. శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళాలు అందించిన 40 మంది దాతలకు చింతలపూడి మానవత శాఖ సన్మానం చేశారు. ఈ సందర్భంగా మానవత కన్వీనర్ కె.నాగ చిన్నారావు మాట్లాడుతూ త్వరలో మానవత శాఖ నిర్మించ తలపెట్టిన కార్యాలయ నిర్మాణానికి దాతలు సహకరించాల్సిందిగా కోరగా కొంతమంది దాతలు తాము సహకరిస్తామని హామీ ఇచ్చిన్నట్లు తెలిపారు. దాతలందరికీ మానవత తరపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ డైరెక్టర్ ఎ.సత్యనారాయణ, ఛైర్మన్ ఎ.అప్పారావు, కార్యదర్శి ఎ.రాజారావు, కోశాధికారి జె.విశ్వేశ్వర రావు, ఉపాధ్యక్షులు బివిఎస్ఎన్.రాజు, కె.సురేంద్ర బాబు, కె.నాగమణి, ఎన్.అశోక్ బాబు, టి.ఆదినారాయణ, పి.చక్రధర రావు, డి.సురేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి - మండవల్లి

రాజ్యాంగానికి అనుగుణంగా నడుచుకుంటూ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండవల్లి ప్రధాన సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించాల్సి రావడంతో ఆయన విగ్రహాన్ని ఆదివారం వేరొక చోట ప్రతిష్టించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1991 సంవత్సరంలో రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నేటికీ 33 సంవత్సరాలు గడుస్తున్నాయన్నారు. జాతీయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా ఆ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ప్రధాన సెంటర్లోనే వేరొక చోట దిమ్మ నిర్మించడం సంతోషించదగ్గ విషయం అన్నారు. ఆదివారం పెద్ద ఎత్తున తీన్మార్ డప్పులతో యువత కేరింతల నడుమ ఘనంగా క్రేన్ సహాయంతో ఏర్పాటు చేసిన దిమ్మపై పెట్టడం అభినందనీయమని తెలిపారు. అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు శాంతరాజు, గౌరవ అధ్యక్షులు చాబెత్తిన విజయ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించగా గౌరవ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు రాజ్యాంగ పీఠికను చదవగా, ముఖ్య సలహాదారు గోరింక గాంధీ ఓటు హక్కును సమర్థవంతంగా వినియోగించుకోవడం మన అందరి బాధ్యత అని తెలియజేసి యువతతో ఓటరు ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాగుల్లు అభిష, బేతపూడి తంబిదాస్, కార్యదర్శి కొండపల్లి రవి వరప్రసాద్, ట్రెజరర్ దాకరపు వినోద్, జాయింట్ సెక్రెటరీ వట్టిప్రోలు సుధీర్, ఎగ్జిక్యూటివ్ నెంబర్ మెండ రాజేష్, క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ వివేక్, గౌరవ అధ్యక్షులు దాసరి యోహాన్ రాజు, మేడేపల్లి సైమన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సేవా సమితి సేవలు అభినందనీయం

భీమడోలు: వికలాంగుల సంక్షేమానికి సేవా కార్యక్రమాలు చేపడుతున్న శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి గుండుగొలను సేవలు అభినందనీయమని ఏలూరుకు చెందిన జెఎంఆర్ వైద్యశాల ఛైర్మన్ జంపన మార్రాజు అన్నారు. నెలవారీ కార్యక్రమంలో భాగంగా సేవా సమితి యాజమాన్యం ఆదివారం గ్రామానికి చెందిన 55 మంది వికలాంగులకు బియ్యం, పండ్లు, ఇతరాలు అందజేశారు. వీటిని జెఎంఆర్ వైద్యశాల యాజమాన్యం సమకూర్చింది. వైద్యశాలకు చెందిన వైద్యులు, ప్రముఖ యూరియాలజిస్ట్ డాక్టర్ జంపన శివ సత్యనారాయణ రాజు వికలాంగులకు వైద్య సేవలు అందించారు. వారికి సలహాలు, సూచనలు తెలియజేశారు. ఇదే క్రమంలో గ్రామానికి చెందిన శ్రీవిద్యాలయ పాఠశాలకు చెందిన విద్యార్థులు శ్రీవిఘ్నేశ్వర వికలాంగుల సేవా సమితి అభివృద్ధి కోరుతూ గ్రామస్తుల నుంచి తాము సేకరించిన రూ.2.50 లక్షలు, పాఠశాల యాజమాన్యం అందించిన రూ.50 వేల విరాళంతో కలిపి మొత్తంగా రూ.3 లక్షల చెక్కు రూపంలో డాక్టర్ జంపన శివ సత్యనారాయణ రాజు చేతుల మీదుగా సేవా సమితి యాజమాన్యానికి అందజేశారు. విద్యార్థుల వితరణను పలువురు కొనియాడారు. దాతలను సేవా సమితి యాజమాన్యం సత్కరించారు. ప్రముఖ సినీ దర్శకులు తోట రవి పాల్గొని సేవా సమితికి తన వంతు సహకారాన్ని అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాట్ల రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

6న అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుక

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏపి జెఎసి అమరావతి మహిళా విభాగం జిల్లా శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఈనెల 6వ తేదీన ఉదయం 10 గంటలకు స్థానిక రెవెన్యూ భవనంలో నిర్వహిస్తున్నట్లు ఏపి జెఎసి అమరావతి ఏలూరు జిల్లా మహిళా విభాగం ఛైర్‌పర్సన్ ఆర్‌విబిటి.సుందరి, కో ఛైర్‌పర్సన్ యు.యామిని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకలలో భాగంగా 4వ తేదీ సోమవారం స్థానిక రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటలకు మహిళా ఉద్యోగులు అందరికీ కేరమ్స్, చెస్, లెమన్ స్పూన్, సింగింగ్, డాన్స్, మ్యూజికల్ ఛైర్స్ వక్తృత్వం పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కావున జిల్లాలోని ప్రతి మహిళా ఉద్యోగి ఈ పోటీలలో పాల్గొనాలని వారు కోరారు. పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు ఇవ్వటం జరుగుతుందని తెలిపారు.

వైసిపి అరాచకాలు పెరిగిపోతున్నాయి : కామినేని

ప్రజాశక్తి - ముదినేపల్లి

నియోజకవర్గంలో వైసిపి అరాచకాలు తీవ్రస్థాయిలో పెరిగిపోతున్నాయని మాజీమంత్రి కామినేని శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కాకరవాడ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగిన కామినేని ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడుతూ పేదలకు, పెత్తందారులకు యుద్ధం అని సిఎం జగన్ మోహన్ రెడ్డి అంటున్నారని, దేశంలో రాజకీయ నాయకుల్లో ఆయన కంటే డబ్బున్న వారు లేరని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు కట్టే టాక్స్ సరిపోక జె-టాక్స్ కట్టాల్సి వస్తుందని ఆయన మండిపడ్డారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. రాజధాని లేని రాష్ట్రం మనదే అని, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కాకపోవడంతో రైతులు నష్టోతున్నారని తెలిపారు. ఈ అరాచక పాలన మీద పోరాడాలని, నియోజకవర్గ ప్రజలందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో శాఖాహార ర్యాలీ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస అని, శాకాహారం-అమృతాహారం అని, ఏ జీవిని చంపే హక్కు మనకు లేదని గరికపాటి సుబ్రహ్మణ్యం అన్నారు. గరికపాటి పిరమిడ్ ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ఆగిరిపల్లి పురవీధులల్లో శాకాహార ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భూపతిరాజు, మౌనిక, సత్యవాణి, లక్ష్మీనారాయణ, నాగరాజులు పాల్గొన్నారు.

మానవత సంస్థ చైతన్య రథం ప్రారంభం

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

ద్వారకాతిరుమల శ్రీనివాస జూనియర్ కాలేజీ వద్ద మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు మండల ప్రజల సౌకర్యార్థం నూతనంగా కొనుగోలు చేసిన చైతన్య రథం ప్రారంభించారు. టిడిపి మాజీ జెడ్‌పిటిసి సభ్యులు మొగడతల శ్రీనివాస్ లక్ష్మీ రమణి రూ.5 లక్షల పైచిలుకు విలువ గల మానవత చైతన్య రథాన్ని ద్వారకాతిరుమల మండల గ్రామ ప్రజలకు వినియోగం కొరకు మొగడతల సత్యనారాయణ జ్ఞాపకార్థం మానవత సంస్థ వారికి అందించారు. మానవత సభ్యులు మాట్లాడుతూ ఈ రథం సమకూర్చుటకు మొగతడకల శ్రీనివాస్ లక్ష్మీ రమణి పూర్తి సహాయ సహకారాలు అందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు ఏర్పాటు చేసిన ఆదివాసి చట్టాలు అమలు కాకా హక్కులు పొందలేక పోతున్నారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జాతీయ ముఖ్య సలహాదారు కొర్సా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్, ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రెండు రాష్ట్రాల రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు కాకి మధు అధ్యక్షతన బుట్టాయగూడెం మండలం కోయ అంకం పాలెంలో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 5వ షెడ్యూల్డ్ ప్రాంతంలో గిరిజనేతరులు 1/59, దాని అమెండమెంట్ 1/70 అమలులో వచ్చిన తర్వాత ఏజెన్సీ ప్రాంతంలో అక్రమంగా చొరబడి ఏజెన్సీ వనరులు దోచుకుంటున్నారని అన్నారు. ఏజెన్సీలో అక్రమంగా వలస వచ్చిన గిరిజనేతరులకు ఎటువంటి ఎన్ఓసిలు లేవన్నారు. ఎన్ఓసి లేకుండానే ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా వ్యాపారాలు చేస్తున్న వారిపై ఎటువంటి చర్యలు లేవని తెలిపారు. కొన్ని చోట్ల అధికారులు డబ్బులు తీసుకొని తప్పుడు ఎన్ఓసిలు జారీ చేయడం వల్ల ఏజెన్సీలో అన్ని రకాల గుర్తింపు కార్డులు పొంది ఆదివాసి పథకాలు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి ఏజెన్సీలోని గిరిజనయేతరుల గుర్తింపు కార్డులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను, ఉపాధ్యక్షులు వాబ యోగి, వంతల నాగేశ్వరావు, ఎటిఎ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు కల్లూరి జయబాబు పాల్గొన్నారు.

'నాపై ఆరోపణలన్నీ అవాస్తవం'

కుక్కునూరు : నాపై చేసిన ఆరోపణలన్నీ అవాస్తవమని బాణాల వీరాచారి తెలిపారు. మండలంలోని చీరవల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులైన బాణాల వీరాచారి ఇంటి వద్ద ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిజెపిలో కష్టపడి పనిచేశానని, అయినా ఎటువంటి విలువ ఇవ్వకపోవడంతో పార్టీ మారానని తెలిపారు. నాపై తప్పుడు ప్రచారం చేస్తూ, బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. నాకు బిజెపితో ఎటువంటి సంబంధం లేదని, సభ్యత్వం కూడా లేదని బిజెపి వారు ప్రెస్ మీట్‌లో చెప్పారు. సభ్యత్వం లేకుండా పార్టీ పదవి ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కన్వీనర్ గజ్జి రాజులు పాల్గొన్నారు.